

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో
మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మంగళవారం 420 క్యూసెక్కుల నీరు వస్తోంది. - 8లో



ఆరేళ్లయినా అందని సాయం
కన్న బిడ్డలను కోల్పోయి ప్రభుత్వం ప్రకటించిన ఆర్థికసాయం కోసం తల్లిదండ్రులు ఆరేళ్లుగా ఎదురుచూస్తున్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం 42°/30°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు సాగునీటి దినోత్సవం

నల్లగొండ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా 7వ తేదీ బుధవారం నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి సాగునీటి దినోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నల్లగొండలో ఎంఎన్‌ఆర్ గార్డెన్, హాలియాలో ఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్, చండూర్‌లోని బీఆర్‌సీ ఫంక్షన్ హాల్, దేవరకొండలోని సాయిరమ్య ఫంక్షన్‌హాల్, మిర్యాలగూడలో శ్రీమన్నారాయణ గార్డెన్‌లో, నార్కట్‌పల్లిలోని శ్రీరేణుక ఎల్లమ్మ గార్డెన్‌లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఈ అజయ్‌కుమార్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత సాగునీటి రంగంలో సాధించిన ప్రగతి 2014కు ముందు సాగునీటి విషయంలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను వివరించనున్నారు.

భట్టి యాత్ర రేపటికి వాయిదా

నల్లగొండ : కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర గురువారం జిల్లాలోకి రానుంది. వాస్తవానికి బుధవారమే జిల్లాలోని దేవరకొండ నియోజకవర్గంలోకి యాత్ర ప్రవేశించాల్సి ఉన్నప్పటికీ కల్వకుర్తి నియోజకవర్గంలో యాత్ర ఒకరోజు ఆలస్యం అయ్యిందని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం ఆయన పాదయాత్ర నల్లగొండ జిల్లాలోకి వస్తుందని తెలిపాయి.

ఎన్జీ కాలేజీలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

నల్లగొండ టూటౌన్ : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు మూడు రోజుల పాటు నల్లగొండలోని ఎన్జీ కాలేజీలో ఫిష్ ఫుడ్ పెస్టివల్ (చేపల ఆహార పండుగ) నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ వాల్ పోస్టర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్జీ కాలేజీలో ఈనెల 8న ప్రారంభ కార్యక్రమానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, 9వ తేదీన రాష్ట్ర పశుసంవర్థక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరవుతారని తెలిపారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపల ఆహార పలు స్టాల్స్ ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా అధికారి వెంకయ్య, కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాలలను కాపాడే బాధ్యత ప్రజలదే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

శాలిగౌరారం : ప్రభుత్వ పాఠశాలలను కాపాడే బాధ్యత ప్రజలదేనని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. శాలిగౌరారం మండలంలోని చిత్తలూరి గ్రామంలో తెలంగాణ పౌర స్పందన వేదిక నల్లగొండ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలు దృష్టి పెట్టకపోతే మూతపడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రాచ్యాత దేశాల్లో విద్యారంగం 90 శాతానికిపైగా ప్రభుత్వ ఆధీనంలో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎర్ర రనీల, పాల్వాయి అంజిరెడ్డి, సర్పంచ్ మామిడి కాయల జయమ్మ, ఎంపీటీసీ దాసరి ప్రమీల, పాదూరి వెంకట్‌రెడ్డి, సోమయ్య, రాంరెడ్డి, దేవచిత్తం, యాకయ్య, రాకేష్, రఫీ, జయ, సాగర్ ఉన్నారు.

ఫీజు చెల్లింపునకు 16వరకు గడువు

రామగిరి(నల్లగొండ) : టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ (టీటీసీ) థియరీ పరీక్ష ఫీజు జూన్ 16వ తేదీలోగా చెల్లించాలని డీఈఓ భిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీటీసీ లోయర్ గ్రేడ్ 42 రోజుల శిక్షణ కోర్సు పూర్తి చేసుకున్న అభ్యర్థులు, గతంలో పరీక్ష రాసి ఫెయిల్ అయిన వారు bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారం, ఫీజు చలాన్‌ను సంబంధిత కోర్సు ఇన్‌చార్జికి సమర్పించాలని సూచించారు.

ముందస్తు సాగుకు రెడీ!

- వానాకాలం సీజన్ సాగు 25 రోజుల ముందుకు
- అందుకు అనుగుణంగా కసరత్తు చేస్తున్న వ్యవసాయ శాఖ
- ముందే నాట్లు వేసుకుంటే ప్రకృతి వైపరీత్యాల నుంచి బయటపడే చాన్స్
- బోర్లు, బావులు, చెరువులు కింద ముందస్తు సాగుకు 'ఓకే'..
- సాగర్ ఎడమకాల్వ కింద మాత్రం ఎప్పటిలాగే వరి నాట్లు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవ'సాయం' చేసే దిశలో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందులో భాగంగా వానాకాలం సీజన్‌ను 25 రోజుల ముందే ప్రారంభించేలా వ్యవసాయ శాఖ కసరత్తు ప్రారంభించింది. అకాల వర్షాల నుంచి పంటలను రక్షించుకోవాలంటే వ్యవసాయ పనులు కొంచెం ముందే ప్రారంభించుకునేలా రైతులను సిద్ధం చేస్తోంది. ఏటా వానాకాలం, యాసంగి సీజన్ల కోతల సమయంతో పాటు, కోతలు పూర్తయిన తరువాత కూడా వస్తున్న అకాల వర్షాలు, తుఫాన్ల కారణంగా ధాన్యం తడిసి, వరి నేలకొరగడం, గింజలు రాలిపోయి రైతులు తీవ్రంగా నష్టాల పాలవుతున్నారు. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఈ ప్రకృతి వైపరీత్యాల నుంచి రైతులు బయటపడాలంటే వానాకాలం, యాసంగి పంటల సాగు 25 నుంచి నెల రోజులు ముందుకు రావాలని వ్యసాయ శాఖ రైతులకు సూచిస్తోంది.

నష్టాలను నివారించేందుకే..

వానాకాలం సాగుకు జూన్ మొదటి వారంలోనే వరినార్లు పోసుకోవడం వల్ల జూన్ చివర లేదా జూలై మొదటి వారంలో నాట్లు పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది. వానాకాలం వరి కోతలు నవంబర్ మాసంలో పూర్తవుతాయి. ముఖ్యంగా యాసంగి సీజన్‌కు నవంబర్‌లోనే వరినార్లు పూర్తి చేసుకుంటే మార్చి చివర వరకు వరికోతలు పూర్తవుతాయి. దీంతో ఏప్రిల్/మే నెలల్లో వచ్చే అకాల వర్షాలతో పంటలు నష్టపోకుండా రైతులు బయటపడే అవకాశం ఉంటుందనే ఆలోచనతో సీజన్‌ను ముందుకు జరిపేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

సాగర్ ఎడమ కాలువ కిందే ఇబ్బంది

నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం 520 అడుగుల నీటి మట్టం ఉంది. డెడ్ స్టోరేజీకి 10 అడుగుల ఎత్తులో నీరుంది. ప్రస్తుతం ఆ నీటిని సాగు కోసం తీసుకునే పరిస్థితి లేదు. కేవలం తాగునీటి అవసరాల కోసమే వినియోగించాలి. సాగర్ నుంచి హైదరాబాద్‌కు, జిల్లాలోని 597 గ్రామాలకు తాగునీటిని అందిస్తున్నారు. ఇప్పుడున్న నీరు తాగునీటి అవసరాలకే సరిపోతుంది. సకాలంలో వర్షాలు కురవకపోతే ఎడమ కాల్వ కింద నల్లగొండ, సూర్యాపేట జిల్లాల పరిధిలోని దాదాపు 4 లక్షల ఎకరాలకు సాగు నీటిని విడుదల చేయడం కష్టమే. వర్షాలు పడినా ఎగువ ప్రాజెక్టులైన ఆల్మట్టి, నారాయణపూర్, శ్రీశైలం నిండిన తర్వాతే సాగర్‌కు వరద నీరు వచ్చే అవకాశం ఉంది. అంటే జూలై నెలాఖరు లేదా ఆగస్టు మొదటి వారం వరకు సాగర్‌లోని కుడి, ఎడమ కాల్వలకు సాగునీటికి నీరు విడుదల చేసే అవకాశం లేదు. అందుకే ఎడమ కాలువ కింద ముందస్తు సాగు చేసే అవకాశం కష్టమేనని అధికారులు పేర్కొంటున్నారు.

10లక్షల ఎకరాలకు పైగా వరి సాగు

నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద నల్లగొండ జిల్లాలో 1.65 లక్షల ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో 2.27 లక్షల ఎకరాలకు సాగు నీరందుతోంది. ఏఎమ్మార్పీ కింద 2.65 లక్షల ఎకరాలకు నీరందుతుండగా, మూసీ పరిధిలో 2 లక్షల ఎకరాలు సాగువుతోంది. ఇవి కాకుండా బోరు బావుల కింద ఉమ్మడి జిల్లాలో మొత్తం 10 లక్షలకు పైగా ఎకరాల్లో వరి సాగవుతుంది.

ఏఎమ్మార్పీ, మూసీ, బోరుబావుల కింద ముందుకు..

నల్లగొండ జిల్లాలో ఏఎమ్మార్పీ ద్వారా నింపిన చెరువుల కింద, మూసీ కింద సాగును ముందుకు జరిపే అవకాశం ఉంది. మరోవైపు వాటి పరిధిలోని బోరు బావులల కింద కలుపుకొని మొత్తంగా దాదాపు 6 లక్షలకు పైగా ఎకరాల్లో మాత్రం సాగును ముందుకు జరపవచ్చని అధికారులు చెబుతున్నారు. వీటి పరిధిలో తుకాలను ముందుగానే పోసుకొని నెల రోజుల ముందే నాట్లను కూడా వేసుకునేందుకు అవకాశం ఉంది.

నీటి వృథాను అరికట్టవచ్చు

ఏటా యాసంగి కోతల సమయంలో అకాల వర్షాలు కురుస్తున్నాయి. కొందరు రైతులు ముందుగా సాగు చేస్తుండగా, కొందరు ఆలస్యంగా నాట్లు వేస్తున్నారు. దీంతో కోతలు కూడా ఆలస్యమవుతున్నాయి. కాల్వలకు సాధారణంగా 120 రోజులు మాత్రమే నీటిని విడుదల చేస్తాం. ఆలస్యంగా నాట్లు వేసిన వారికి కోసం అదనంగా నీటిని విడుదల చేయాల్సి వస్తోంది. దాంతో నీరు వృథా అవుతోంది. నాట్లు ముందు వేయడం వల్ల రైతులు అకాల వర్షం నుంచి తప్పించుకోవడంతోపాటు నీటి వృథాకు అవకాశం ఉండదు.

– అజయ్‌కుమార్, ఎస్‌ఈ, నీటిపారుదల శాఖ

మిర్యాలగూడ ఆస్పత్రికి అరుదైన గుర్తింపు

- లక్ష్య కార్యక్రమం కింద ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వం
- ఇటీవల ఏరియా ఆస్పత్రిని పరిశీలించిన కేంద్ర బృందం
- ఆస్పత్రికి రానున్న ప్రత్యేక నిధులు



మిర్యాలగూడలోని ఏరియా ఆస్పత్రి

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి అరుదైన గుర్తింపు దక్కింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన లక్ష్య కార్యక్రమానికి ఏరియా ఆస్పత్రి ఎంపికైంది. లక్ష్య కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పర్యటించిన కేంద్ర వైద్యుల బృందం మిర్యాలగూడకు సైతం వచ్చింది. ఆస్పత్రిలోని వార్డులు, మెటర్నిటీ వార్డు, కాన్పులు జరిగే తీరు, ఆపరేషన్ థియేటర్, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించి వెళ్లింది. లక్ష్య కార్యక్రమం కింద రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు ఆస్పత్రులు ఎంపిక కాగా.. అందులో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి ఉంది. ఈ కార్యక్రమం కింద ప్రతి సంవత్సరం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులను విడుదల చేస్తుంది. ఆ నిధులతో ఆస్పత్రిలో రోగులకు కావాల్సిన అన్ని రకాల మెరుగైన వసతుల కల్పన, వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుంది.

ఆస్పత్రిలో పెరిగిన వసతులు..

మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో కాలక్రమేనా అన్నిరకాల వైద్య సేవలను అందుబాటులోకి తేవడంతో పాటు వైద్యులు, వైద్య సిబ్బందిని సైతం నియమించి రోగులకు మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వం ఆస్పత్రులపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పాటు కేసీఆర్ కిట్ వంటి పథకాలు అమలు చేయడంతో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి ఓపీల సంఖ్య క్రమేణా పెరుగుతోంది. గతంలో రోజుకు 80లోపే ఓపీ నమోదు కాగా.. ప్రస్తుతం 250కి పైగా నమోదవుతోంది. మరోవైపు కాన్పులు గతంలో నెలకు 30 వరకు మాత్రమే అయ్యేవి. ఇప్పుడు ప్రతినెలా 150కి పైగా కాన్పులు అవుతుండడం గమనార్హం. కాగా ఇటీవల మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి రెండు వందల పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయ్యింది. రూ.16 కోట్లతో నూతన భవన నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఈ తరుణంలో.. లక్ష్య కార్యక్రమంలోనూ ఏరియా ఆస్పత్రికి చోటు దక్కడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆస్పత్రిని అభివృద్ధి చేస్తాం



ఏరియా ఆస్పత్రికి కేంద్ర ప్రభుత్వం రూపొందించిన లక్ష్య కార్యక్రమం కింద మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి చోటు దక్కడం అరుదైన గౌరవంగా భావిస్తున్నాం. స్థానిక ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు చొరవతో ఆస్పత్రిలో వసతులు సమకూరుతున్నాయి. లక్ష్య కార్యక్రమం ద్వారా వచ్చే నిధులతో ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేస్తాం.

– డాక్టర్ శ్రీనివాస సమరద్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, మిర్యాలగూడ

క్రీడాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ టూటౌన్ : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా జిల్లా స్థాయిలో ప్యారా ఖేలో ఇండియా సెంటర్ నిర్మించడానికి జిల్లాకు చెందిన 40 ఏళ్లలోపు సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి మక్బూల్ అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, బాక్సింగ్, బ్యాడ్మింటన్, సైక్లింగ్, హాకీ, జూడో, రోలింగ్, షూటింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్ క్రీడల్లో ప్రావీణ్యం కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 16వ తేదీలోగా దరఖాస్తులు అందించాలని కోరారు. వివరాలకు 98663 17321 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బీఆర్‌ఎస్‌తోనే పరిశ్రమల అభివృద్ధి

- శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న శాసనమండలి చైర్మన్ గుత్తా

మిర్యాలగూడ : రాష్ట్రంలో పరిశ్రమల సర్వతోముఖాభివృద్ధి బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని శ్రీమన్నారాయణ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన పారిశ్రామిక ప్రగతి దినోత్సవంలో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావుతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణకు పరిశ్రమలు వెల్లువలా వస్తున్నాయంటే అది కేవలం సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన పారిశ్రామిక విధానాలే కారణమన్నారు. టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో 1.43 లక్షల ఎకరాల ప్రభుత్వ భూమిని అభివృద్ధి చేయాలని ప్రభుత్వ నిర్ణయించిందని, పారిశ్రామిక వాడల ఏర్పాటుతో రాష్ట్రానికి రూ.2.62 లక్షల కోట్ల పెట్టుబడుల వచ్చాయని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుతో 17.62 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక, ఐటీ రంగం శరవేగంగా అభివృద్ధి చెందేందుకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఎనలేని కృషి చేయడంతో ప్రస్తుతం దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉందన్నారు. 2015లో రాష్ట్ర ప్రభుత్వం టీఎస్ ఐపాస్ చట్టాన్ని తీసుకురావడంతో అనేక దేశాల కంపెనీలు ముంబై, చెన్నై, బెంగుళూరు, నోయిడా వంటి నగరాలను కాదని మన హైదరాబాద్‌కు వస్తున్నాయని తెలిపారు. మిర్యాలగూడ నియోజకవర్గం పరిధిలో ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటుకు 46 ఎకరాల భూమిని వెంకటాద్రిపాలెంలో సేకరించి అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ చెన్నయ్య, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, ఎంపీపీ నూకల సరళాహన్మంతరెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మోసిన్‌అలీ, మిర్యాలగూడ రైస్‌మిల్లర్లు గౌరు శ్రీనివాస్, వెంకటరమణచౌదరి, గుడిపాటి శ్రీనివాస్, ఇండియా సిమెంట్స్ మేనేజర్ సుధీర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీందర్‌సాగర్, అన్నభీమోజు నాగార్జునచారి పాల్గొన్నారు.

ఇక్కడి బొమ్మలు.. దేశ వ్యాప్తంగా ఎగుమతి కావాలి



ఇండస్ట్రీయల్ పార్క్‌లో నిర్వహించిన పారిశ్రామిక ప్రగతి ఉత్సవంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

- స్థానిక యువతకు ఇండస్ట్రీయల్ పార్కులో ఉపాధి కల్పిస్తాం
- రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్
- కేటీఆర్ హయాంలో రాష్ట్రానికి ఎన్నో పరిశ్రమలు
- విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి



టాయ్స్ పార్క్‌లో బొమ్మలను పరిశీలిస్తున్న మంత్రులు కేటీఆర్, జగదీష్‌రెడ్డి తదితరులు

చౌటుప్పల్ : దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు ఎగుమతి అయ్యేలా టాయ్స్ (బొమ్మలు) ఉత్పత్తి చేయాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ సూచించారు. బొమ్మల తయారీ తెలంగాణకు కొత్తేమీ కాదని, నిర్మల్, చేర్యాల ప్రాంతాల్లో ప్రసిద్ధమైన బొమ్మల తయారీ జరుగుతోందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా, భవిష్యత్ తరాల అభిరుచి మేరకు ఉత్పత్తులు ఉండాలన్నారు. చైనా దేశం నుంచి దిగుమతి జరుగుతున్న విధంగానే ఇక్కడి నుంచి దేశవ్యాప్తంగా బొమ్మలు ఎగుమతి జరగాలని ఆకాంక్షించారు. చౌటుప్పల్ మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామంలోని గ్రీన్ ఇండస్ట్రీయల్ పార్కులో మంగళవారం జరిగిన పలు కార్యక్రమాల్లో రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. టాయ్స్‌పార్కుకు భూమి పూజ చేశారు. 16 మంది పారిశ్రామికవేత్తలకు భూమి కేటాయింపు పత్రాలను అందజేశారు. ఇండస్ట్రీయల్ పార్కు ఫొటో ఎగ్జిబిషన్‌ను, ఉత్పత్తుల ప్రదర్శనను తిలకించారు. అనంతరం పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. ఆయా కార్యక్రమాలలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. స్థానికంగా ఉన్న నిరుద్యోగులకు ఇండస్ట్రీయల్ పార్కులోనే శిక్షణ అందించి సరైన ఉపాధి కల్పిస్తామన్నారు. గ్రీన్ ఇండస్ట్రీయల్ పార్కు తెలంగాణకే మోడల్‌గా మారిందన్నారు.

ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు మంత్రిగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీగా రాజగోపాల్‌రెడ్డి ఉన్న సమయంలో ఈ ప్రాంతంలో చెత్త డంపింగ్‌కు ఆనాటి ప్రభుత్వం ప్రతిపాదించిందన్నారు. అలాంటి డంపింగ్ ప్రాంతాన్ని సీఎం కేసీఆర్ నాయకత్వంలో రద్దు చేయించి ప్రతిష్టాత్మకమైన ఇండస్ట్రీయల్ పార్కును తీసుకువచ్చామన్నారు. టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు మాట్లాడుతూ మల్కాపురం ఇండస్ట్రీయల్ పార్కుకు రాష్ట్ర వ్యాప్తంగా డిమాండ్ ఉందన్నారు. తాము సైతం ఇక్కడే పరిశ్రమలు ఏర్పాటు చేసుకుంటామని, అవసరమైన స్థలాన్ని ఇవ్వాలని పలువురు కోరుతున్నారని గుర్తుచేశారు. తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య అధ్యక్షుడు కొండవీటి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో కేవలం 5వేల ఎకరాల్లోనే ఉన్న ఇండస్ట్రీయల్ పార్కులు ప్రస్తుతం 1.50 లక్షల ఎకరాల్లో ఏర్పాటయ్యాయన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, భువనగిరి జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిషోర్‌కుమార్, చిరుమర్తి లింగయ్య, ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్‌రంజన్, కలెక్టర్ పమేలా సత్పతి, చేనేత జౌళిశాఖ కమిషనర్ బుద్ద ప్రకాష్‌జ్యోతి, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్, టిఫ్ అధ్యక్షుడు కొండవీటి సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఫుడ్ ప్రాసెస్ యూనిట్‌లో మహిళలతో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

పారిశ్రామికవేత్తల బాధలను పారదోలాం..

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ముందుచూపుతో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. విద్యుత్ కష్టాలు తీరడంతో పారిశ్రామికవేత్తలకు కూడా బాధలు తొలగిపోయాయని అన్నారు. విద్యావేత్తగా ప్రపంచమంతా తిరిగిన అనుభవంతో మంత్రి కేటీఆర్ రాష్ట్రానికి ఎన్నో రకాల పరిశ్రమలను తీసుకువస్తున్నారని కొనియాడారు.

16 మందికి ఏఎస్సైలుగా పదోన్నతి



ఎస్పీ అపూర్వరావుకు బొకే అందజేస్తున్న నూతన ఏఎస్సైలు

రామగిరి(నల్లగొండ) : జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న 16 మంది హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్సైలుగా పదోన్నతి పొందారు. వీరంతా మంగళవారం ఎస్పీ అపూర్వరావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ గౌరవం పెంచే విధంగా పని చేయాలన్నారు. ఉద్యోగోన్నతితోపాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని ఆ విధంగా పోలీసులు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో సరైన విధంగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకొని న్యాయం జరిగే విధంగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు జయరాజు సిబ్బంది పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన వారు వీరే..

వేములపల్లి	సీహెచ్.రేణుక
మిర్యాలగూడ రూరల్	రాములునాయక్, కె.శ్రీనివాస్
శాలిగౌరారం	ఎం.రాములు
చిట్యాల	వెంకటేశ్వర్లు
డీసీఆర్‌బి	బి.శ్రీను
కట్టంగూర్	ఆంజనేయులు
హాలియా	ఎండీ.అబ్బల్
ఇంటిలిజెన్స్	కె.పెద్దిరెడ్డి, జి.వెంకటేశ్వర్‌రావు
నల్లగొండ వన్‌టౌన్	ఆర్.శ్రీనయ్య
దేవరకొండ	ఎస్.నర్సింహ
కనగల్	ఎస్.సత్యనారాయణ
ఓడీఇన్ ఎస్‌బిబి	జి.మాధవరావు
మిర్యాలగూడ వన్‌టౌన్	ఎస్‌కె.గఫార్
డీఎస్‌బి	ఏ.వసంత్

గ్రూప్–1 నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి

- పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి
- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నల్లగొండ : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈ నెల 11న నిర్వహించే గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష సజావుగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై లైజన్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూప్–1 పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. 51 కేంద్రాల్లో 16,095 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తున్నారని, వాటికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. లైజన్ ఆఫీసర్లు వారికి కేటాయించిన పరీక్ష కేంద్రాలను చీఫ్ సూపరింటెండెంట్‌లతో కలిసి పర్యటించి చెక్ లిస్ట్ ప్రకారం మౌలిక వసతులను పరిశీలించాలని సూచించారు. ఉదయం 10.15 తరువాత అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించవద్దని ఆదేశించారు. ఎలక్ట్రానిక్ వాచ్, సెల్‌ఫోన్ తదితర పరికరాలను అనుమతించొద్దన్నారు. అభ్యర్థులు చెప్పులు ధరించి రావాలని, షూ వేసుకురావద్దని సూచించారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాన్‌కార్డు మినహా ఏదైన ఒరిజినల్ గుర్తింపు కార్డును వెంట తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, లైజన్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయంలో చోరీ


ఆలయంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

నాగార్జునసాగర్: గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన నందికొండ మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హిల్‌కాలనీ నుంచి పైలా న్‌కు వెళ్లే దారిలో గల ముత్యాలమ్మ ఆలయంలోకి సోమవారం రాత్రి దుండగులు ప్రవేశించారు. ఆలయంలోని అమ్మవారి ఆభరణాలు, హుండీలోని కానుకలను చోరీ చేశారు. ఉదయం పూజారి ఆలయానికి రాగా చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం మేరకు ఎస్‌ఐ సురేష్ ఆలయాన్ని పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా, ఇటీవల కాలంలో ఇదే ఆలయంలో మూడోసారి చోరీ జరిగినట్లు స్థానికులు తెలిపారు.

పూరి గుడిసె దగ్ధం


ఆర్థికసాయం అందజేస్తున్న బీఎల్‌ఆర్

మిర్యాలగూడ టౌన్ : షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధమైంది. మిర్యాలగూడ మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని లక్ష్మీపురం గ్రామ పంచాయతీ పరిధిలోని అజ్మీరతండాలో మంగళవారం భారీగా ఈదురుగాలులు వీచాయి. దీంతో ధీరావత్ లక్ష్మా గుడిసెలో ఎవరూ లేని సమయంలో విద్యుత్ వైర్లు అంటుకుని మంటలు లేచాయి. గుడిసె పైకప్పుకు మంటలు అంటుకోవడంతో చూస్తుండగానే దగ్ధమైంది. ప్రమాదంలో గుడిసెలో ఉన్న దుస్తులు, బియ్యం, సామగ్రి, రూ.2లక్షల నగదు కాలి బూడిదయ్యాయి. స్థానికులు గమనించి మంటలను ఆర్పివేశారు. కాగా, విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మిర్యాలగూడ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బీఎల్‌ఆర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.

పీఏసీఎస్‌లో నగదు చోరీ ఘటనపై కేసు

గరిడేపల్లి : గరిడేపల్లి మండలం కీతవారిగూడెం పీఏసీఎస్‌లో ఇటీవల జరిగిన చోరీ ఘటనపై మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుండగులు ఈ నెల 3న రాత్రి సమయంలో సహకార బ్యాంకు వెనుక భాగంలో గల కిటికీలను తొలగించి క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.7.83లక్షలను చోరీ చేశారు. నేరేడుచర్ల ఎన్‌డీసీసీబీ మేనేజర్ రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అతివేగానికి ఇద్దరు బలి

- కారు, టీవీఎస్ ఎక్సెల్ ఢీ.. మంటలు చెలరేగి రెండు వాహనాలు దగ్ధం
- అక్కడికక్కడే ఒకరు.. చికిత్స పొందుతూ మరొకరు మృతి
- తుర్కపల్లి మండల పరిధిలో ప్రమాదం
- మృతులిద్దరూ రాజాపేట మండల వాసులు


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది


దగ్ధమైన టీవీఎస్ ఎక్సెల్ వాహనం


మైసయ్య (ఫైల్)

తుర్కపల్లి : అతివేగం ఇద్దరి ప్రాణాలను బలితీసుకుంది. వేగంగా వస్తున్న కారు ఎదురుగా టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే ఒకరు, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృత్యుఒడికి చేరుకున్నారు. ప్రమాద సమయంలో టీవీఎస్‌ఎక్సెల్ పెట్రోల్ ట్యాంక్ పగిలి కారు కిందికి దూసుకుపోవడంతో మంటలు చెలరేగి రెండు వాహనాలు దగ్ధమయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల పరిధిలో మంగళవారం చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటనపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్‌కు చెందిన స్నేహితులు బంగారు భాను, కాంపెల్లి రవికుమార్, సుంకిశాల అజయ్‌కుమార్, ఐతం ఆంజనేయులు యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకునేందుకు కారులో బయలుదేరారు. ఇదే క్రమంలో రాజాపేట మండలం నెమిల గ్రామపంచాయతీ స్వీపర్‌గా పనిచేస్తున్న భువనగిరి మైసయ్య (58), స్నేహితుడు ఎర్ర శంకరయ్య (54)తో కలిసి పని నిమిత్తం టీవీఎస్ ఎక్సెల్‌పై వెంకటాపూర్‌కు వెళ్తున్నారు. అయితే, వీరిద్దరి వాహనాలు తుర్కపల్లి మండలం వెంకటాపూర్ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో టీవీఎస్ ఎక్సెల్‌పై ప్రయాణిస్తున్న మైసయ్య, శంకరయ్య ఎగిరి రోడ్డుపై పడిపోయారు. మైసయ్య డివైడర్‌పై పడడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన శంకరయ్యను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

పెట్రోల్ ట్యాంక్ పగిలి..

రెండు వాహనాలు ఎదురెదురుగా బలంగా ఢీకొనడంతో టీవీఎస్ ఎక్సెల్ పెట్రోల్ ట్యాంక్ పగిలి కారు కిందికి దూసుకుపోయింది. ఈ క్రమంలో మంటలు అంటుకుని రెండు వాహనాలు దగ్ధమయ్యాయి. అయితే, కారులో ప్రయాణిస్తున్న స్నేహితుల బృందం ప్రమాదాన్ని పసిగట్టి కిందికి దిగిపోవడంతో ప్రాణాలను దక్కించుకున్నారు. కాగా, తుర్కపల్లి నుంచి యాదాద్రి వరకు ఓ వైపు రోడ్డు పనులు పూర్తయి రెండో వైపు సాగుతున్నాయి. యాదాద్రి నుంచి వచ్చే వాహనదారులు, ఇటు తుర్కపల్లి నుంచి వచ్చే వాహనదారులు నాలుగు లేన్ల రోడ్డు మీద ఒకే వైపు వేగంగా వస్తుండడంతో ప్రమాదాలబారిన పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రమాదం అనంతరం స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి వచ్చి మంటలు ఆర్పివేశారు. ఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తుర్కపల్లి ఎస్‌ఐ రాఘవేందర్ గౌడ్ తెలిపారు.

టాటాఏస్ వాహనం బైక్‌ను ఢీకొట్టడంతో..


వీరయ్య (ఫైల్)

మఠంపల్లి: టాటాఏస్ వాహనం ఎదురుగా బైక్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. మఠంపల్లిలో మంగళవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మఠంపల్లికి చెందిన సత్తారపు వీరయ్య (50) పనిమీద బైక్‌పై మండలంలోని చౌటపల్లికి వెళ్లాడు. అక్కడ పని ముగిసిన తర్వాత తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో వరదాపురం గ్రామానికి చెందిన అలివేలుకు లిఫ్ట్ ఇవ్వడంతో ఇద్దరూ కలిసి మఠంపల్లికి వస్తున్నారు. ఈ క్రమంలో మఠంపల్లి సమీపంలోని పెట్రోలుబంకు వద్దకు రాగానే టాటాఏస్ వాహనం ఎదురుగా వచ్చి వీరి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్ పైనుంచి ఇద్దరూ రోడ్డుపై పడిపోవడంతో వీరయ్య అక్కడికక్కడే మృతిచెందగా గాయపడిన అలివేలును హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. వీరయ్యకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు, బస్సు ఢీకొట్టడంతో..


భిక్షమయ్య (ఫైల్)

హాలియా : కారు, ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి, రెండు గేదెలు మృతి చెందాయి. ఈ ఘటన అనుముల మండలంలోని పంగవానికుంట గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పంగవానికుంట గ్రామానికి చెందిన పెరిక భిక్షమయ్య (45) వ్యవసాయ కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం భిక్షమయ్య తన రెండు పాడిగేదెలను తొలుకొని మేత కోసం గ్రామ శివారులోని కొత్తపల్లి వైపు వెళ్లాడు. రాత్రి గేదెలను తొలుకొని ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో పంగవానికుంట గ్రామ శివారులోని హాలియా నుంచి సాగర్ వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి వెనుక నుంచి భిక్షమయ్య, గేదెలను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో రోడ్డుపై పడ్డారు. అదే సమయంతో హాలియా నుంచి సాగర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి రోడ్డుపై పడిఉన్న భిక్షమయ్యతో పాటు పాడిగేదెలను ఢీకొట్టడంతో అక్కడికక్కడే అతను, పాడిగేదెలు మృతిచెందాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలం వద్దకు చేరుకుని భిక్షమయ్య మృతదేహాన్ని సాగర్ కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు, ఆర్టీసీ బస్సును స్వాధీనం చేసుకున్నారు. కారు, ఆర్టీసీ బస్సు ఢీకొన్నడంతోనే తన భర్తతో పాటు రెండు గేదెలు మృతి చెందాయని మృతుడి భార్య పెరిక సైదమ్మ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

ఒక్కరోజు ఎస్‌ఐగా క్యాన్సర్ బాధితురాలు

- పోలీస్ శాఖ మేక్ ఎ విష్ కార్యక్రమంలో భాగంగా బాధ్యతలు అప్పగింత
- కోరిక నెరవేర్చిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన స్వాతి


ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న స్వాతి, చిత్రంలో సూర్యాపేట ఎస్పీ రాజేంద్ర ప్రసాద్

చివ్వెంల(సూర్యాపేట) : క్యాన్సర్‌తో పోరాడుతున్న ఓ బాధితురాలి కలను పోలీస్ శాఖ సాకారం చేసింది. మేక్ ఎ విష్ కార్యక్రమంలో భాగంగా ఆ బాధితురాలిని ఒక్కరోజు ఎస్‌ఐగా నియమించి సంతోష పరిచింది. వివరాలు ఇలా ఉన్నాయి. చివ్వెంల మండల పరిధిలోని జగనాతండాకు చెందిన ధరావతు చాంప్లా, బూబిల పెద్ద కూతురు స్వాతి డిగ్రీ చదువుతోంది. ప్రోటిస్ట్ క్యాన్సర్‌తో బాధపడుతున్న స్వాతిని రెండు రోజుల క్రితం రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె తనకు జీవితంలో పోలీస్ ఆఫీసర్ కావాలని ఉందని మంత్రితో తెలిపింది. ఆయన ఆ యువతిని ఒక్క రోజు ఎస్‌ఐగా నియమించాలని అధికారులను ఆదేశించారు. దీంతో పోలీస్ శాఖ మేక్ ఎ విష్ కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ స్వాతిని చివ్వెంల మండల ఎస్‌ఐగా ఒక్క రోజు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్వాతి త్వరగా కోలుకుని తన కలను సాకారం చేసుకోవాల ఆకాంక్షించారు. మంత్రి జగదీశ్‌రెడ్డి, కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ సూచనల మేరకు స్వాతికి అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన స్వాతి వివిధ కేసుల నిమిత్తం స్టేషన్‌కు వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వారితో మాట్లాడారు. తక్షణమే ఫిర్యాదులపై చర్యలు తీసుకుని, వారికి న్యాయం చేకురేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. తన అనారోగ్యాన్ని గుర్తించి కోరిక నెరవేర్చిన ఎస్పీ, అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి కోటాచలం, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ హర్షవర్ధన్, సీఐ సోమ్ నారాయణ్ సింగ్, ఎస్‌ఐ విష్ణుమూర్తి, స్వాతి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

జనగామలో ఇప్పర్తి వాసి దుర్మరణం

జనగామ రూరల్: నిలిచున్న ఇసుక లారీని మరో ఇసుక లారీ ఢీకొట్టిన ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన జనగామ జిల్లా హైదరాబాద్–వరంగల్ రహదారిలోని పెంబర్తి వై జంక్షన్ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. మృతుడి కుమారుడు జుట్టు అనిల్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా మునుగోడు మండలం ఇప్పర్తి గ్రామానికి చెందిన జుట్టు వెంకటయ్య (40) ఇసుక లారీడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం నుంచి హైదరాబాద్‌కు వస్తున్నాడు. ఈ క్రమంలో జనగామ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న మరో ఇసుక లారీ పెంబర్తి హైవే గురుకుల పాఠశాల వద్ద ఎలాంటి ఇండికేటర్ లేకుండా నిలిపి ఉంచారు. అదే మార్గంలో ఇసుక లోడుతో వస్తున్న వెంకటయ్య ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో క్యాబిన్‌లో ఇరుక్కపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటయ్య కుమారుడు అనిల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తిని చేరదీసిన ఆశ్రమ నిర్వాహకులు


మతిస్థిమితం లేని వ్యక్తిని ఆశ్రమానికి తీసుకెళ్తున్న శంకర్

యాదగిరిగుట్ట రూరల్ : యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలోని అమ్మ ఒడి అనాథాశ్రమ నిర్వాహకులు మంగళవారం మతిస్థిమితం లేని వ్యక్తిని చేరదీశారు. ఆశ్రమ నిర్వాహకులు జెల్లా శంకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి మండలం పగిడిపల్లిలోని హనుమాన్ దేవాలయం పరిసర ప్రాంతంలో గుర్తుతెలియని, మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి తిరుగుతున్నాడని అమ్మ ఒడి ఆశ్రమ నిర్వాహకులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆ వ్యక్తిని చేరదీసి, భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇచ్చి అమ్మ ఒడి మానసిక వికలాంగుల ఆశ్రమానికి తీసుకువచ్చామని తెలిపారు.

పాలేరు వాగులో మునిగి బాలిక మృతి


నందిని (ఫైల్)

నూతనకల్ : ఈత నేర్చుకునేందుకు స్నేహితులతో కలిసి వాగులోకి వెళ్లిన ఓ బాలిక నీట మునిగి మృతిచెందింది. ఈ విషాదకరకర ఘటన నూతన్‌కల్ మండల పరిధి మాచనపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాచపల్లికి చెందిన మట్టపల్లి గంగమ్మ కూతురు నందిని(12) స్నేహితులతో కలిసి గ్రామ శివారులోని పాలేరు వాగులో ఈత కొట్టేందుకు వెళ్లింది. నడుముకు వాటర్ క్యాన్‌లను కట్టుకొని వాగులో ఈత కొడుతున్న సమయంలో క్యాన్ తాడు ఊడిపోవడంతో నందిని నీట మునిగింది. పక్కనే ఈత కొడుతున్న స్నేహితులు నీట మునుగుతున్న బాలికను చూసి గ్రామంలోకి పరిగెత్తి నందిని తల్లి గంగమ్మకు తెలియజేశారు. ఆమె లబోదిబోమనడంతో గ్రామస్తులు వాగులోకి దిగి వెతికి బాలికను బయటకు తీయగా అప్పటికే మృతి చెందింది. భర్త చనిపోవడంతో ఇద్దరు ఆడ పిల్లలను అల్లారుముద్దుగా సాకుతున్న గంగమ్మ చిన్న కూతురు చనిపోవడంతో గుండెలవిసేలా రోదించిన తీరు గ్రామస్తులను కలచివేసింది. దీంతో మాచపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వేర్వేరు చోట్ల ఇద్దరి బలవన్మరణం

చౌటుప్పల్ : వేర్వేరు చోట్ల ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారు. చౌటుప్పల్, హుజూర్‌నగర్ పట్టణాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని కేసీఆర్ కాలనీకి చెందిన పెదకంటి మధు(48) డీసీఎం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్య లింగమ్మ, నలుగురు కుమార్తెలు ఉన్నారు. పెద్దకుమార్తె వివాహం జరిగింది. నాలుగు సంవత్సరాలుగా మద్యానికి బానిసైన మధు భార్య, పిల్లలను వేధించేవాడు. ఆ క్రమంలో పది రోజుల క్రితం సైతం అదే మాదిరిగా వ్యవహరించాడు. వేధింపులు భరించలేక భార్య తన ముగ్గురు పిల్లలను తీసుకొని తల్లిగారి గ్రామమైన మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామానికి వెళ్లిపోయింది. దీంతో మధు ఒక్కడే ఇంట్లో ఉంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో తన తమ్ముడు సుదర్శన్‌కు ఫోన్ చేసి తనకు బాధగా ఉందని, బతకాలని లేదని చెప్పి ఫోన్ ఆఫ్ చేశాడు. వెంటనే అప్రమత్తమైన సుదర్శన్ తన కుమారుడు సాయిప్రకాష్‌ను పంపించాడు. బయట గేటు గడియ పెట్టి ఉండగా, ఇంటి డోర్ మాత్రం తీసి ఉండడంతో అనుమానంతో లోపల చూడగా ఉరివేసుకొని వేలాడుతూ కన్పించాడు. ఇదే విషయాన్ని మృతుడి భార్యకు తెలియజేయగా వెంటనే ఆమె తన ఇంటికి వచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జీవితంపై విరక్తి చెంది మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి భార్య లింగమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటిపై కిరోసిన్ పోసుకుని..

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన గణపవరపు పిచ్చమ్మ (90) శ్రీనగర్ కాలనీలో నివాసం ఉంటోంది. ఎనిమిదేళ్ల క్రితం భర్త చనిపోగా అప్పటి నుంచి ఆమె ఒంటరిగానే ఉంటోంది. ఈమెకు పిల్లల లేరు. ఇటీవల పిచ్చమ్మ మానసిక స్థితి సరిగా లేదు. తనలో తానే మాట్లాడుకుంటూ ఉంటోంది. కాగా సోమవారం తెల్లవారుజామున ఆమె ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పు పెట్టుకుంది. గమనించిన బంధువులు మంటలు ఆర్పి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స చేయించారు. అక్కడ నుంచి సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందింది. ఈమేరకు ఆమె మరిది గణపవరపు రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


గోపయ్య మృతదేహం

హుజూర్‌నగర్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌ఐ వెంకట్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హుజూర్‌నగర్ పట్టణంలోని గోవిందాపురం గ్రామానికి చెందిన కందుల గోపయ్య (40) సుతారి మేస్త్రీగా పనిచేస్తున్నాడు. గత నెల 25న సుతారీ పని నిమిత్తం తన స్కూటీపై మట్టంపల్లి వెళ్లి తిరిగి అదే రోజు రాత్రి సమయంలో ఇంటికి వస్తున్నాడు. మార్గమధ్యలో యారగ్రట్టు వద్ద గేదెలను తప్పించబోయి ప్రమాదవశాత్తు కింద పడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని సోమవారం ఇంటికి వచ్చాడు. రాత్రి 8గంటల సమయంలో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు అతడిని పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించాడని వైద్యులు ధ్రువీకరించారు. అతని భార్య దేవమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ద్విచక్రవాహనదారుడికి గాయాలు

పాలకవీడు: గేదెను ఢీకొని ఓ ద్విచక్ర వాహనదారుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ఘటన పాలకవీడు మండల పరిధిలోని గుడుగుంట్లపాలెం వద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుడుగుంట్లపాలెం గ్రామానికి చెందిన బి.బాబు పని ముగించుకుని నేరేడుచర్ల నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా గ్రామ శివారులో అడ్డువచ్చిన గేదెను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కిందపడిన బాబుకు తీవ్ర గాయాలలు కావడంతో వెంటనే 108 అంబులెన్స్ సహాయంతో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో హైదరాబాదుకు తీసుకెళ్లినట్లు 108 సిబ్బంది వెల్లడించారు.

గుండెపోటుతో ఒడిశా కూలీ మృతి

వేములపల్లి : గుండెపోటుతో ఒడిశా కూలీ మృతిచెందాడు. ఒడిశా రాష్ట్రానికి చెందిన మదనమాజి(57) భార్యతో కలిసి మాడ్గులపల్లి మండలంలోని ఇందుగులలో మహదేవయ్య ఇటుకబట్టీ వద్ద కూలీగా పనిచేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం వరకు పని చేసి భోజనానికి ఇంటికి చేరుకున్నాడు. నీరసంగా ఉంది నిమ్మరసం ఇవ్వమని భార్యను కోరగా ఇచ్చింది. తాగే క్రమంలో ఛాతిలో నొప్పి వస్తుందని భార్యకు చెప్పగా మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. గుండెపోటుతో మృతిచెందినట్లుగా వైద్యులు నిర్ధారించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య పనమాజి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావు

సూర్యాపేట రూరల్ : పరిశ్రమల ఏర్పాటు, అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని సూర్యాపేట జిల్లా కలెక్టర్ యస్.వెంకట్రావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం సువెన్ లైఫ్ సైన్సెస్ ఫార్మా కంపెనీలో పరిశ్రమల శాఖ జీఎం తిరుపతయ్య అధ్యక్షతన నిర్వహించిన పారిశ్రామిక ప్రగతి ఉత్సవం కార్యాక్రమంలో కలెక్టర్ వెంకట్రావు, అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ హాజరయ్యారు. జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం పరిశ్రమలు ఎంతో అభివద్ధి చెందాయని తెలిపారు. ప్రపంచంలో అన్ని రంగాల్లో తెలంగాణ పోటీ పడుతుందన్నారు. టీఎస్ ఐపాస్ ద్వారా పారిశ్రామిక ప్రగతి పురోగతి సాధిస్తుందని చెప్పారు. నూతన పారిశ్రామిక విధానం ద్వారా పరిశ్రమలకు అధునాతన మౌలిక సదుపాయాలను తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తుందని వివరించారు. టీఎస్ ఐపాస్ ద్వారా సింగిల్ విండో ఏర్పాటు చేసి నెల రోజుల లోపే పరిశ్రమలకు అనుమతులు జారీ చేస్తుందని తెలిపారు. తెలంగాణలో మీ సేవల ద్వారా అనేక మార్పులకు చోటు చేసుకుందని, మీసేవ ద్వారా అపరిష్కృతంగా ఉన్న భూసమస్యలను 96శాతం ధరణిలో పరిష్కరించబడిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పాలసీల ద్వారా యువతకు అనేక ఉపాధి కల్పన కల్పిస్తుందన్నారు. అనంతరం వివిధ రంగాల పారిశ్రామిక వేత్తలను సన్మానించారు. కార్యక్రమంలో గఫార్, మీలా మహదేవ్, సోమనర్సయ్య, శ్రీకాంత్, శేషగిరిరావు, టీజే రాయుడు, వెంకట్ రెడ్డి, టి.సైదులు పాల్గొన్నారు.

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



మూసీ క్రస్ట్ గేటు ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

- ఒక గేటు ద్వారా నీటి విడుదల

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీంతో అధికారులు ప్రాజెక్టు ఒక క్రస్టు గేటును పైకెత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. మూసీ ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో మంగళవారం ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగింది. సోమవారం 244 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో మంగళవారం ఉదయానికి 420 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో సోమవారం తెరిచి ఉంచిన 3వ నంబరు క్రస్టు గేటును అదే విధంగా ఉంచి 332 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులున్నారు. మూసీ ప్రాజెక్టులో గరిష్ట నీటిమట్టం 645 అడుగులు కాగా, ప్రస్తుతం 644.60 అడుగుల వద్ద నిలకడగా ఉంది. రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా 4.36 టీఎంసీల నీరు నిల్వ ఉంది .

పచ్చిరొట్ట సాగుకు సమయమిదే..

- పచ్చిరొట్ట ఎరువు పైరుకు బలం
- రాయితీపై వ్యవసాయ శాఖ జీలుగ, జనుము విత్తనాలు పంపిణీ




గుర్రంపోడు మండలం పిట్టలగూడెంలో సాగు చేసిన జనుము చేను (ఫైల్)

గుర్రంపోడు : పచ్చిరొట్ట ఎరువులైన జీలుగు, జనుము పంటలు సాగుకు అనువైన సమయమిదే కావడంతో రైతులు విత్తనాలను సిద్ధం చేసుకుంటున్నారు. పచ్చిరొట్ట ఎరువులు అందించే జనుము, జీలుగ విత్తనాలను వ్యవసాయ శాఖ రాయితీపై అందిస్తోంది. వ్యవసాయశాఖ కార్యాలయాల్లో ఈ విత్తనాలు ప్రస్తుతం పంపిణీ చేస్తున్నారు. ప్రధాన పంట వరి సాగుకు ముందుగా సాగు చేసి నేలలో కలియదున్నుకొనే పచ్చిరొట్ట పంటల సాగుపై మండల వ్యవసాయాధికారి కంచర్ల మాధవరెడ్డి సలహాలు, సూచనలు ఇలా వివరిస్తున్నారు.

పచ్చిరొట్ట ప్రయోజనాలు

పచ్చిరొట్ట సాగుతో భూమి సారవంతమవుతుంది. పచ్చిరొట్ట పంటలను 30–40 రోజులప్పుడు పూతదశలో నేలలో కలియదున్నడం వల్ల సేంద్రియ పదార్థం, హ్యూమస్(ఆకుపెంట) నత్రజని పెరుగుతాయి. నేల సత్తువ, నిర్మాణం వృద్ధిచెందుతుంది. నేలకు నీటిని నిలుపుకునే శక్తి పెరుగుతుంది. నేల కోతను నివారించి, నేలపై పొరను రక్షిస్తుంది. మొక్కల వేర్లు బాగా వృద్ధిచెంది, నేల అట్టడుగు పొరల నుంచి పోషకాలను సంగ్రహిస్తాయి. ఎకరం భూమిలో పచ్చిరొట్ట పంటను కలియదున్నడం వల్ల ఎకరాకు సిఫారసు చేసిన యూరియాలో ఒక బస్తా యూరియా తగ్గించుకోవచ్చు. రసాయనిక ఎరువుల ఖర్చు తగ్గుతుంది. ఈ మొక్కలు లెగ్యూమ్ జాతికి చెందినందున ఇవి వేర్ల బొడిపల్లో నత్రజని స్థిరీకరించి మరలా ప్రధాన పంట సాగులో నత్రజని మొక్కలకు అందేలా చేస్తుంది. ఎకరాకు 15 కిలోల జీలుగ, జనుము విత్తనాలు అవసరం అవుతాయి. సాగు ఖర్చు తగ్గడంతోపాటు నేల బౌతిక లక్షణాలను పునరుద్ధరిస్తుంది. పచ్చిరొట్ట పంటల సాగు పచ్చిరొట్ట పంటలైన జనుము, జీలుగలను రైతులు ఎక్కువగా సాగు చేస్తుంటారు. మే, జూన్ నెలల్లో కురిసే తొలకరి వర్షాలు మొదలైనప్పుడు విత్తనాలు చల్లుకోవాలి. పూత దశలో 35 నుంచి 40 రోజుల్లో భూమిలో కనీసం 15 సెంటీమీటర్ల లోతులో కలియదున్నాలి. దీర్ఘకాలిక పంటల్లో, పండ్లతోటల్లో పచ్చిరొట్ట పైర్లను సాగు చేసి కలియదున్నడం వల్ల నేల సారవంతమవుతుంది. ఇందులో 8 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్, 35 కిలోల నత్రజని ఉంటాయి. వరిసాగులో ముందస్తుగా పచ్చిరొట్ట సాగు చేసి కలియదున్నడం వల్ల బియ్యంలో విటమిన్లు, మాంసకృత్తుల శాతం పెరిగి నాణ్యమైన దిగుబడులు వచ్చినట్లు పరిశోధనా ఫలితాల్లో వెల్లడైంది.